జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 62 14-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
జాతీయ దిన పత్రిక తొలివెలుగు మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



# పేదలకు శత్రువులం కాదు

- 'మూసీ ఇన్వైట్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నది పునరుజ్జీవంతో రాష్ట్రం గ్రోత్ ఇంజిన్‌గా మారుతుంది
- కానీ కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారు
- కడుపులో కత్తులు, మాటల్లో విషంతో అడ్డుకోవాలని చూస్తున్నారు
- రాజకీయ స్వార్థం కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా?
- బాధితులకు ఎలాంటి పరిహారం ఇద్దామో చెబితే దాన్ని అమలు చేద్దాం
- ఏవైనా లోపాలు ఉంటే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్న సీఎం

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవ పథకం అమలులో ఏవైనా లోపాలుంటే సూచనలు, సలహాలు ఇస్తే స్వీకరిస్తామని, మరింత అద్భుతంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తామని, అసలు పథకమే వద్దంటే మాత్రం వినే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పారు. తమ ప్రభుత్వం పేదలకు శత్రువు కాదని, వారిని నిరాశ్రయులను చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవంలో నిరాశ్రయులకు ఆయా నియోజకవర్గాల్లో ప్రభుత్వ స్థలం ఉంటే.. అక్కడే ఇళ్లు కట్టించి ఇస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరి ఆస్తులూ గుంజుకునేందుకు కాదని అన్నారు. పేదలతో శత్రుత్వం పెంచుకుంటే మళ్లీ ఎవరైనా అధికారంలోకి వస్తారా? అని ప్రశ్నించారు.

2లో



# ఇరాన్ లొంగిపోబోతోంది..

**జీ7 దేశాలతో ట్రంప్ వ్యాఖ్యలు..**

**లొంగిపోయేదే లేదని స్పష్టం చేసిన ఇరాన్..**

ఇరాన్ యుద్ధం రోజు రోజుకు తీవ్రమవుతోంది. ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయిల్ దాడులు చేస్తుంటే, ఇరాన్ గల్ఫ్ దేశాలపై తన ప్రతీకారం తీర్చుకుంటోంది. మరోవైపు..

2లో

## మరో అద్భుత ప్రాజెక్ట్ ప్రారంభించిన మంత్రి నారా లోకేష్..

**ఈ ప్రాజెక్ట్‌తో భారీగా ఉద్యోగ అవకాశాలు..**

**ఏపీని రక్షణ రంగంలో కూడా అగ్రస్థానంలో నిలుపుతామన్న మంత్రి.**



# అగ్రి టెక్ విప్లవంలో 'మై ఫామ్' తొలి అడుగు

- 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' ఏర్పాటు
- వరి సాగుతో అనుకున్నంత ఆదాయం లేదు
- ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి
- 47 లక్షల టన్నుల ధాన్యం సేకరణ
- 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ
- ఏలూరులో 500 ఎకరాల్లో కోకో సిటీ
- కృష్ణా జిల్లా సూరంపల్లిలో చంద్రబాబు వెల్లడి



విజయవాడ: 'రైతు కష్టం నాకు తెలుసు. ఓ మధ్యతరగతి రైతు బిడ్డగా చెబుతున్నా.. వ్యవసాయాన్ని లాభాల దిశగా నడిపించడానికి ఇక 'అగ్రి టెక్' దిశగా అడుగులు వేయబోతున్నాం. అగ్రి బిజినెస్‌మెన్ కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ) ఏర్పాటు చేస్తా. సాగును సమూలంగా కొత్త పుంతలు తొక్కించడానికి పంచసూత్రాలతో ముందుకు వెళ్తాం' అని సీఎం చంద్రబాబు ప్రకటించారు. శుక్రవారం కృష్ణా జిల్లా గన్నవరం మండలం

- మిగతా 2వ పేజీలో

# ఈశాన్యంలో శాంతి వీచికలు

- బీజేపీ ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి పరుగులు
- అస్సాం పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- రూ.19,680 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం
- పీఎంకిసాన్ సమ్మాన్ నిధి 22వ విడత సొమ్ము విడుదల

గువాహటి: ఒకప్పుడు బాంబులు, తుపాకుల మోతతో దద్దరిల్లిన ఈశాన్య భారతదేశంలో నేడు శాంతి పవనాలు వీస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇక్కడ అశాంతి అంతమై, అభివృద్ధి పరుగు ఆరంభమైందని స్పష్టంచేశారు. ఈశాన్య ప్రాంతానికి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో స్వార్థ రాజకీయాల కోసమే కొన్ని ఒప్పందాలు కుదుర్చుకున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ శుక్రవారం అస్సాంలో పర్యటించారు. మౌలిక సదుపాయాలు, ఇంధన రంగాల్లో రూ.19,680 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం



# మొజాయిక్ డిఫెన్స్

**ఇరాన్‌ను దుర్భేద్యంగా మార్చిన యుద్ధ తంత్రం**

**సైనిక యూనిట్లకు ఎక్కడికక్కడ స్వయం ప్రతిపత్తి**

**దాంతో నాయకుడు లేకున్నా స్వతంత్రంగా పోరు**



ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్‌అమెరికా ఉరుములేని పిడుగులా విరుచుకుపడ్డాయి. సుప్రీం లీడర్ ఖమేనీతో పాటు అగ్ర నాయకత్వాన్నంతా దాదాపుగా తుడిచిపెట్టేశాయి. ఆ దాడుల్లో ఆర్మీ చీఫ్

2లో



# గృహావసరాలకు గ్యాస్ కొరతలేదు

- ఆర్గానిక్ ఫార్మింగ్‌లో స్వయం సహాయక సంఘాలను భాగస్వాములను చేయండి
- వ్యవసాయ సంస్థలపై సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేయండి
- వ్యవసాయ శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

2లో

# ర్యాలీపై దాడులు!

- పేలుళ్లతో దద్దరిల్లిపోయిన టెహ్రాన్
- ఇజ్రాయెల్‌అమెరికా క్షిపణుల వర్షం
- భారీ స్థాయిలో ఇరాన్ ప్రతీకార దాడులు
- ఒమన్‌లో ఇద్దరు భారతీయుల మృతి
- 11 మంది క్షతగాత్రుల్లో 10 మంది మనోళ్లే
- దుబాయ్ ఎయిర్‌పోర్టుపై దాడి, నలుగురికి గాయాలు
- యూఎస్ యుద్ధ నౌక అబ్రహం లింకన్‌పై దాడులు
- భారీగా దెబ్బ తిందన్న ఇరాన్, ఖండించిన అమెరికా



దుబాయ్/వాషింగ్టన్/జెరూసలేం: పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతూనే ఉంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ శుక్రవారం భారీ పేలుళ్లతో దద్దరిల్లిపోయింది. శుక్రవారం నగరం నడిరోడ్డున అత్యంత శక్తిమంతమైన పేలుళ్లు సంభవించాయి. ప్రఖ్యాత ఫిరదౌసీ స్క్వేర్ వద్ద ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన ఖుద్స్ డే ప్రదర్శనల్లో ప్రజలు వేలాదిగా పాల్గొని ఉండగా ఈ ఉదంతం జరిగినట్లు ప్రభుత్వ టెలివిజన్ పేర్కొంది. పేలుడు కారణమేమిటో తెలియకపోయినా ఆ ప్రాంతంపై దాడి చేస్తామని శుక్రవారం ఉదయమే ఇజ్రాయెల్ సైన్యం



## పేదల ఇళ్లు కూలిస్తే సహించబోం: రాంచందర్

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవం పేరిట పేదల ఇళ్లు కూల్చివేస్తే ఊరుకోబోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదని, పేదల ఇళ్ల కూల్చివేతను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం, బీజేపీ రాష్ట్ర

2లో

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..


# గృహావసరాలకు గ్యాస్ కొరతలేదు

హైదరాబాద్: రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఉదయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలతో కలిసి ప్రీ బడ్జెట్ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆర్గానిక్, నేచురల్ ఫార్మింగ్ లో స్వయం సహాయక సంఘాలను భాగస్వాములుగా చేయాలని వ్యవసాయ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా కూరగాయలు, పూల సాగు చేయించి ఆ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. దరైతు వేదికలు, వ్యవసాయ మార్కెట్ గోడౌన్లు, వేర్ హౌసింగ్ గోదాములపై సోలార్ రూఫ్ టాప్ లు ఏర్పాటు చేసుకొని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ వ్యవస్థ ద్వారా వ్యవసాయ శాఖకు విద్యుత్ ఖర్చులు మిగలడంతో పాటు అదనంగా ఉత్పత్తి చేసిన విద్యుత్తును విక్రయించుకునే అవకాశం, ఆర్థికంగా బలపడే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ శాఖ సంస్థలపై సోలార్ రూఫ్ టాప్ ల ఏర్పాటుకు సంబంధించి రెడ్కో సంస్థను సంప్రదించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం తెలిపారు.

# ఇరాన్ లొంగిపోబోతోంది..

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్, యూఎస్ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఇరాన్ "లొంగిపోబోతోంది"అని ట్రంప్ 7 దేశాల నాయకులతో అన్నారు. ట్రంప్ తన "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ"పై గొప్పలు చెప్పుకున్నారు. ఇరాన్ రూపంలో ప్రపంచానికి పట్టిన క్యాన్సర్‌ను వదిలిస్తాన్నామని మిత్రదేశాలతో ట్రంప్ అన్నారు. యుద్ధాన్ని త్వరగా ముగించి, హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా మార్చాలని మిత్రదేశాలు ట్రంప్‌ను కోరాయి. ఇదిలా ఉంటే, ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ అమెరికా, ట్రంప్‌కు వార్నింగ్ ఇచ్చారు. తమ దేశం లొంగిపోదని అన్నారు. తన తొలి ప్రకటనలో.. అమెరికా-ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన ప్రతీవ్యక్తికి ప్రతీకారం తీర్చుకుంటామని అన్నారు. మా వీరుల రక్తాన్ని మరిచిపోం అని అన్నారు. అమెరికాపై ఒత్తిడి పెంచడానికి హోర్ముజ్ జలసంధి మూసే ఉంచుతామని స్పష్టం చేశారు.

# మరో అద్భుత ప్రాజెక్ట్ ప్రారంభించిన మంత్రి నారా లోకేష్..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అగ్రపథాన నిలిపే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు రక్షణ , తయారీ రంగాల్లోనూ ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చాలన్న లక్ష్యంతో నెల్లూరు జిల్లాలో ఒక భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న అటానమస్ మారిటైం షిప్ యార్డుకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డు కావడం విశేషం. ఈ ప్రాజెక్టు ద్వారా రక్షణ రంగానికి అవసరమైన అత్యాధునిక నౌకల నిర్మాణం ఇక్కడ జరగనుంది. ఈ ప్రాజెక్టు మొదటి దశలో సుమారు రూ.45 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నారు. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 750 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మానవరహిత నౌకలు , అత్యాధునిక సాంకేతికతతో కూడిన యుద్ధ నౌకల తయారీకి ఈ కేంద్రం చిరునామాగా మారబోతోంది. శంకుస్థాపన సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏపీని కేవలం ఐటీ రంగంలోనే కాకుండా.. తయారీ, రక్షణ రంగాల్లో కూడా దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు.

# మొజాయిక్ డిఫెన్స్!

సయ్యద్ అబ్దుల్ ఇబ్రహీం ముసావీ, ఐఆర్‌జీసీ చీఫ్ కమాండర్ మొహమ్మద్ పక్పూర్, రక్షణ మంత్రి అజీజ్ నాసిర్‌జాదేతో పాటు మరో 30 మందికి పైగా పౌర, సైనిక అగ్ర నేతలను అంతం చేశాయి. అంతటితో ఆగకుండా రెండు వారాలుగా ఇరాన్‌పై ఎడతెరిపి లేని దాడులతో విరుచుకుపడుతున్నాయి. ఆ దేశ డిఫెన్స్, దాడుల వ్యవస్థలను ఎక్కడికక్కడ నేలమట్టం చేస్తూ వస్తున్నాయి. పైగా నూతన సుప్రీం నేత, ఖమేనీ కుమారుడు మొజ్తబా కూడా తొలి రోజు దాడిలోనే గట్టిగా గాయపడ్డట్లు వార్తలొస్తున్నాయి. అయినా సరే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశించినట్టుగా ఇరాన్‌ను ఓడించడం దేవుడెరుగు, ఆ దేశాన్ని కాస్త కూడాలొంగదీయలేకపోయారు. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ ముమ్మర దాడులతో విరుచుకుపడుతూనే ఉంది. పశ్చిమాసియా మొత్తాన్నీ యుద్ధక్షేత్రంగా మార్చేసింది. ఇంకెంత కాలమైనా పోరాడేందుకు సిద్ధమంటోంది. ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేసే నాయకత్వం లేకపోయినా, వ్యవస్థలన్నీ కుప్పకూలుతున్నా, డెడ్లీ కాంబినేషన్‌గా పరిగణించే ఇజ్రాయెల్‌అమెరికా సంయుక్త దాడులను దీటుగా ఎదుర్కోవడం ఇరాన్‌కు ఎలా సాధ్యపడుతోంది .తమకు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ సమన్వయం చేసే వ్యవస్థ లేక ఉన్నపళంగా చేతులెత్తేసింది. ఈ ఉదంతాన్ని ప్రత్యక్షంగా గమనించిన జఫారీ ఇరాన్‌కు ఎప్పటికీ అలాంటి గతి పట్టకుండా జాగ్రత్త పడాలని నిశ్చయించుకున్నారు.

# పేదల ఇళ్లు కూలిస్తే సహించబోం: రాంచందర్

కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. గుజరాత్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును పాలకులు ఉదాహరణగా తీసుకోవాలని సూచించారు. ఒకప్పుడు కాలుష్యంతో నిండిన సబర్మతి నదిని నరేంద్ర మోదీ సీఎంగా ఉన్నప్పుడు నర్మదా నదితో అనుసంధానం చేసి ప్రక్షాళన చేశారని గుర్తుచేశారు. అక్కడ ఉంటున్న 4వేలమంది పేదలకు పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టారని వివరించారు.

# ర్యాలీపై దాడులు!



(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించింది. అంతేగాక ఫిరదౌసీ స్క్వేర్ వద్ద ర్యాలీలు మొదలయ్యేందుకు కాసేపటి ముందే టెహ్రాన్‌పై ఇజ్రాయెల్‌అమెరికా భారీ స్థాయి వైమానిక దాడులకు దిగాయి. దాంతో రాజధాని మీదుగా ఎటు చూసినా దట్టమైన పొగ అలముకుని కన్పించింది. అయితే దాడులకు ఇరానీలు వెరవలేదు. పేలుళ్ల అనంతరం కూడా వేలాదిగా టెహ్రాన్ వీధుల్లో ప్రదర్శనల్లో పాల్గొన్నారు. 'అమెరికాకు, ఇజ్రాయెల్‌కు మరణం' అంటూ పెద్దపెట్టున నినదించారు. ఇరాన్ న్యాయవ్యవస్థ చీఫ్ గులాం హుసేన్ మొహసెనీ ఎజెయ్, రక్షణ శాఖ ఉన్నతాధికారి అలీ లరిజానీ తదితరులు కూడా అందులో భాగస్వాములయ్యారు. పేలుళ్లలో చాలామందే మరణించినట్లు భావిస్తున్నారు. ఇరాన్ మాత్రం ప్రాణనష్టంపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. పాలస్తీనావాసులకు మద్దతుగా ఇరాన్ ఏటా ఖుద్స్ డే జరుపుతూ వస్తోంది. ఇరాన్‌వ్యాప్తంగా క్షిపణి, ఇజ్రాయెల్‌అమెరికా బాంబు దాడులు శుక్రవారమూ కొనసాగాయి. ప్రధానంగా సైనిక, క్షిపణి కమాండ్ వ్యవస్థలనే లక్ష్యం చేసుకున్నారు. ఇరాన్ కూడా భారీ స్థాయిలో ప్రతి దాడులకు దిగింది. మధ్యధరా ప్రాంతంలో మోహరించిన అమెరికాకు చెందిన భారీ విమానవాహక యుద్ధ నౌక అబ్రహం లింకన్‌పై ఏకంగా బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్టు రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. "అత్యంత కచ్చితత్వంతో కూడిన మా దాడుల్లో నౌకకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుతం అది పని చేయడం లేదు. యుద్ధరంగం నుంచి వెనుదిరిగి వెళ్లిపోతోంది" అని పేర్కొంది. అమెరికా మాత్రం ఈ వార్తలను ఖండించింది. ఒక ఇరాన్ పడవ కేవలం తమ నౌకకు అతి సమీపానికి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది.

అమెరికాకు చెందిన మరో విమానవాహక యుద్ధ నౌక గెరాల్డ్ ఫోర్డ్‌లోనూ మంటలు చెలరేగడం కలకలం రేపింది. దీనికి యుద్ధంతో సంబంధం లేదని అమెరికా తెలిపింది. "లాండ్రీ ప్రదేశంలో చెలరేగిన మంటల్లో ఇద్దరు నావికులకు గాయాలయ్యాయి. నౌకకు నష్టమేమీ వాటిల్లలేదు. ఎప్పట్లాగే చురుగ్గా యుద్ధంలో పాల్గొంటోంది" అని వెల్లడించింది. మరోవైపు లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడులు నిర్నిరోధంగా కొనసాగాయి. దాంతో 60 మందికి పైగా గాయపడ్డారు. అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా గల్ఫ్ దేశాలపైనా ఇరాన్ తీవ్రస్థాయిలో దాడులు కొనసాగించింది. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంపై శుక్రవారం మరోసారి డ్రోన్ దాడులు జరిపింది. దాంతో అక్కడ మంటలు చెలరేగాయి. నలుగురు గాయపడ్డట్టు సమాచారం. దుబాయ్ పారిశ్రామిక ప్రాంతంపైనా దాడులు జరిగాయి. దాంతో దుబాయ్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సెంటర్‌లో ఒక భవనం భారీగా దెబ్బ తిన్నది. అబుదాబి విమానాశ్రయ సమీపంలో కూడా డ్రోన్ దాడులతో మంటలు చెలరేగాయి. తమపైకి దూసుకొచ్చిన 7 ఇరాన్ బాలిస్టిక్ మిసైళ్లను, 27 డ్రోన్లను అడ్డుకున్నట్టు యూఏఈ ప్రకటించింది. ఒమన్‌లోని సొహార్ నగరంపై రెండు డ్రోన్ దాడులు జరిగాయి. వాటిలో ఒకటి అల్ అవీ పారిశ్రామిక ప్రాంతాన్ని తాకడంతో అక్కడ పని చేస్తున్న ఇద్దరు ప్రవాస భారతీయులు దుర్మరణం పాలయ్యారు.

## అగ్రి టెక్ విప్లవంలో 'మై ఫామ్' తొలి అడుగు

(మొదటి పేజీ తరువాయి)

సూరంపల్లి గ్రామంలోని మామిడి తోటల్లో 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు రూ.2,675.97 కోట్లు విడుదల చేశారు. దీంతో ఈ ఏడాది మూడు విడతల్లో కలిపి రూ.8,985.41 కోట్లు జమ చేసినట్లయింది. అనంతరం రైతులనుద్దేశించి సీఎం ప్రసంగించారు. సంక్షేమ పథకాలు చెప్పిన సమయానికి అందించాలనే ఉద్దేశంతో అన్నదాత సుఖీభవ-పీఎమ్ కిసాన్ అనుసంధానం చేశామన్నారు. అగ్రిటెక్‌లో భాగంగా పూర్తి స్థాయిలో ఏఐ ఆగ్రోనమిస్టలను తీసుకొస్తున్నామని చెప్పారు. 'మై ఫామ్' యాప్ తెచ్చామని.. అగ్రి టెక్ విప్లవంలో ఇది తొలి అడుగుగా పేర్కొన్నారు. పంటలను ఫొటోలు తీయడం ద్వారా చీడపీడలు తెలుసుకోవడంతో పాటు వాటి నివారణకు ఏ విధంగా కృషి చేయాలన్నదానిపై ఈ యాప్ ద్వారా మరిన్ని సూచనలు అందుతాయన్నారు. తెలుగులో అడిగినా సమాధానాలు చెప్పే విధంగా తీర్చిదిద్దామని, రానున్న రోజుల్లో బహుభాషల్లో పనిచేసే విధంగా మార్చుతామని చెప్పారు. ఎరువుల వినియోగం, వాతావరణ ఆధారిత వ్యవసాయం, నీటిపారుదల సలహాలు, పంటలకు అనుగుణంగా డేటా ఆధారిత సలహాలు, డ్రోన్లు, వ్యవసాయ యంత్రాల సేవలతో అనుసంధానం వంటివి చేపడతామన్నారు. డ్రోన్‌తో పిచికారీ, ఏఐ ఆధారిత కీటక గుర్తింపు వంటి అనేక విధానాలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. వ్యవసాయం స్వరూప స్వభావాలను పూర్తిగా మార్చివేసి లాభసాటిగా మార్చి వేసేందుకు పంచసూత్రాలు.. నీటి భద్రత.. డిమాండ్ ఆధారిత పంటలు.. అగ్రిటెక్.. ఫుడ్ ప్రాసెసింగ్... మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతం ప్రాథమికంగా దీనిని అమల్లోకి తెచ్చామని.. రానున్న రోజుల్లో సమగ్రంగా అమలు చేస్తామని తెలిపారు. గతంలో కృష్ణా జలాలు సవ్యంగా రాకపోవడంతో పండించిన పంటలు తుఫాన్ల బారిన పడేవి. అలాంటి పరిస్థితుల్లో నేడు తుఫాన్ కంటే ముందే పంటలు పండిస్తున్నారు. నీటి భద్రత ద్వారా ముందుకు పోతున్నాం. రిజర్వాయర్లు, చెరువుల్లో ఉన్న నీటిలో 65 శాతం ఖరీఫ్‌కు వాడాం. రబీలో వాడినా ఇప్పటికీ సమృద్ధి నీళ్లు అందుబాటులో ఉన్నాయంటే కూటమి ప్రభుత్వం ముందు చూపే కారణం. ఇకపై మే 15న నారుమళ్లు పోసుకుని వర్షపు నీటితోనే ఖరీఫ్ పూర్తి చేసుకోవాలి. అప్పుడు ఖరీఫ్ నీటిని రబీలో కూడా వాడుకోవచ్చు. ఇలా చేయడం ద్వారా రానున్న రోజుల్లో 75 శాతం నీరు నిల్వ ఉంచుకోవచ్చు. ఈఏడాది ఎల్‌నినో ప్రభావం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో నీటి లభ్యత తగ్గే వీలుంది. జగన్ ఐదేళ్ల అసమర్థ పాలన వల్లే రాష్ట్రం అప్పుల సుడిగుండంలో ఉంది. ఆదాయం సైతం తగ్గింది. మేం అధికారం చేపట్టిన 20 నెలల్లో ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నాం. ఇన్ని సమస్యలు పెట్టుకుని అన్ని వర్గాలకూ న్యాయం చేసిన ప్రభుత్వం మాది. ఇప్పటి వరకు 47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి కేవలం 24 గంటల్లో రైతుల అకౌంట్‌లో డబ్బులు వేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. రూ.310 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చాం.

## ఈశాన్యంలో శాంతి వీచికలు

(మొదటి పేజీ తరువాయి)



చేశారు. మరికొన్ని ప్రాజెక్టులకు పునాదిరాయి వేశారు. అలాగే పీఎంకిసాన్ సమ్మాన్ నిధి 22వ విడత కింద దేశవ్యాప్తంగా 9.3 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2,000 చొప్పున జమ చేశారు. కోక్రాఝార్ జిల్లాలో జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి రాజధాని గువాహటి నుంచి వర్చువల్‌గా ప్రసంగించారు. ప్రతికూల వాతావరణం వల్ల ప్రధానమంత్రి కోక్రాఝార్‌కు చేరుకోలేకపోయారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వ పాలనలో అస్సాంలో నూతన అధ్యాయం మొదలైందని, ఇక్కడ పూర్తిస్థాయిలో శాంతియుత పరిస్థితులు నెలకొన్నాయని, శరవేగంగా అభివృద్ధి జరుగుతోందని వెల్లడించారు. గతంలో అధికారం చెలాయించిన కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ భద్రతను పణంగా పెట్టిందని, స్థానికుల భూములను చొరబాటుదారులకు కట్టబెట్టిందని మండిపడ్డారు. అస్సాంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధిచెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అస్సాంలో తేయాకు తోటల కార్మికులకు జరిగిన అన్యాయాన్ని తాము సరిదిద్దినట్లు ప్రధానమంత్రి మోదీ చెప్పారు. భూములపై వారికి హక్కులు కల్పించామని, పట్టాలు అందజేశామని అన్నారు. ప్రధాని మోదీ స్వయంగా మూడు కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒక మహిళా కార్మికురాలికి మోదీ పాదాభివందనం చేశారు. కార్మికులకు న్యాయం చేసినందుకు హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వాన్ని అభినందించారు. అస్సాం కార్మికులు పండించిన తేయాకు గుజరాత్‌కు వస్తోందని, అక్కడ ఆ తేయాకుతో తేనీరు తయారు చేసి విక్రయించానని తెలిపారు. ఛాయ్‌వాలాగా పనిచేసి ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. భూమి పట్టాలు ఇవ్వడం ద్వారా తేయాకు కార్మికుల రుణం తీర్చుకుంటున్నానని స్పష్టంచేశారు. ప్రేమ దుకాణం(మొహబ్బత్ కీ దుకాణ్) తెరిచామంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న ప్రచారాన్ని ప్రధానమంత్రి తిప్పికొట్టారు. కాంగ్రెస్ అబద్ధాల దుకాణం(ఝూటే వైదో కీ దుకాణ్) తెరిచిందని విమర్శించారు. అక్కడ ఒక అబద్ధానికి మరో నాలుగు సూపర్ అబద్ధాలు బహుమతిగా లభిస్తాయని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్న ఆలోచన కాంగ్రెస్‌కు ఏనాడూ లేదన్నారు. హామీలు నిలబెట్టుకోవడమే లక్ష్యంగా డబుల్ ఇంజన్ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు.

# పేదలకు శత్రువులం కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఇది భవిష్యత్ తరాల కోసం చేస్తున్న అభివృద్ధి అని, ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యమని పేర్కొన్నారు. దాదాపు 115 సంవత్సరాల కిందట అప్పటి నిజాం నవాబు ఎంతో దూరదృష్టితో చేసిన మంచి పనుల్లో కనీసం మనం పది శాతం కూడా చేయకుండా ఈ నగరాన్ని అలాగే వదిలేద్దామా? అని ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో 'మూసీ ఇన్‌వైట్'పేరుతో ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తర్వాత ప్రజా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పర్యావరణవేత్తలు, మేధావులు, పలు సంస్థల కన్సల్టెంట్లను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. 'ప్రభుత్వం మంచి కార్యక్రమం చేపడుతున్నప్పుడు మేధావులు దానిని సమర్థించేలా మాట్లాడాలి. కొన్ని రాజకీయ పార్టీలు కడుపులో కుళ్లు, మాటల్లో విషం, చూపుల్లో పగతో వ్యవహరిస్తున్నాయి. రాజకీయ స్వార్థం కోసం ఘనమైన చరిత్రను కాలగర్భంలో కలిపేలా వ్యవహరిస్తున్నాయి. అక్రమ సంపాదునతో ప్రతీనెలా రూ.5 కోట్లు వ్యయం చేస్తూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. మూసీ బ్యూటిఫికేషన్.. లూటిఫికేషన్ అంటున్నారు. ప్రజలను ఆందోళనకు గురిచేసేలా కొంతమంది ఉద్దేశ పూర్వకంగా, మరికొందరు అసంపూర్ణ సమాచారంతో అర్ధ సత్యాలను ప్రచారం చేస్తున్నారు. రూ.5 వేల కోట్లతో గాంధీ విగ్రహం అంటూ సొంత తెలివి ప్రదర్శిస్తున్నారు. నిజానికి గాంధీ విగ్రహానికి అయ్యే వ్యయం రూ.75 కోట్లు మాత్రమే. ఈ ప్రాజెక్టు మొత్తం 55 కిలోమీటర్లు కాగా.. తొలిదశలో గాంధీ సరోవర్ వరకు 21 కిలోమీటర్ల అభివృద్ధికి అయ్యే వ్యయం కేవలం రూ.7 వేల కోట్లు మాత్రమే. మహాత్ముడి సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై లేదా? మన చరిత్రను తిరిగి రాసుకునే అవకాశాన్ని మనం వదులుకుందామా? దేవతలు యజ్ఞాలు చేసినపుడు రాక్షసులు భగ్నం చేసే ప్రయత్నం చేశారు. సుబాహు, మారీచుడు అడ్డుకునే ప్రయత్నం చేస్తే లోక కళ్యాణం కోసం చేసే యజ్ఞం ఆగిందా? లోకకళ్యాణం కోసం చేసే పనులకు సహకరించక పోయినా పరవాలేదు. కానీ అడ్డుకునే ప్రయత్నం మాత్రం చేయొద్దు..' అని సీఎం విజ్ఞప్తి చేశారు. నది చుట్టూనే నాగరికత అభివృద్ధి: 'మానవ నాగరికత నది చుట్టూనే అభివృద్ధి చెందింది. 1908 మూసీ వరదలు నగరాన్ని ముంచెత్తిన తర్వాత.. నగరాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో అప్పటి నిజాం ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను నిర్మించారు. ప్రస్తుతం వందేళ్లు దాటినా ఆ రిజర్వాయర్లు నగర ప్రజలతో పాటు, వలసలు వచ్చిన లక్షలాది మంది దాహార్తి తీరుస్తున్నాయి. హైదరాబాద్ నగరాన్ని నిజాం ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దారు. పాలకులు మారినా నగర అభివృద్ధి ఆగలేదుం. అలాంటి నగరాన్ని కాపాడుకోవడం మనకర్తవ్యం. 1994 నుంచి ఇప్పటివరకు పరిపాలనలో విధా న నిర్ణయాల్లో వెనుకబడటం ఎప్పుడూ లేదు. పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన వాళ్లు ఎందుకు మూసీ ప్రక్షాళన అడ్డుకుంటున్నారు? వారసత్వ సంపద కలిగిన ఈ నగరాన్ని ఇలాగే వదిలేద్దామా? మూసీ పునరుజ్జీవం జరిగితే కాంగ్రెస్‌కు, రేవంత్‌రెడ్డికి మంచి పేరు వస్తుందని, ఇక వాళ్లకు అధికారం కలగా మిగిలిపోతుందనే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. దార్శనికతతో అభివృద్ధి ప్రణాళికలు రచించి అభివృద్ధి చేసిన వారే చరిత్రలో గుర్తుంటారు..'అని అన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

**రాజపేట, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రాజపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. భాజపా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మెండు భగవాన్ రెడ్డి మాట్లాడుతూ.. సాగుకు సరిపడా కరెంట్ అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు మేక రమేష్, మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తామని గొప్పలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో కనీసం 12 గంటల నాణ్యమైన సరఫరా కూడా ఉండటం లేదని విమర్శించారు. రైతు భరోసా, ఎకరానికి రూ. 7,500 సాయం, క్వింటాల్ ధాన్యానికి రూ. 500 బోనస్ వంటి హామీలన్నీ బుట్టదాఖలయ్యాయని దుయ్యబట్టారు. రైతు కూలీలకు, కౌలు రైతులకు ఇస్తామన్న ఆర్థిక సాయం ఏమైందని వారు ప్రశ్నించారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కుమ్మరి లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు బర్మా శ్రీశైలం, కార్యదర్శి చాపురం శ్రీశైలం, పట్టణ అధ్యక్షుడు సాధనమైన శంకర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మార్క శివ, కాసోజు సంపత్, బూర్గు శేఖర్ రెడ్డి, కాకల్ల నవీన్, మాయాకోటి రాజు, పారుపల్లి సంజీవరెడ్డి, బిర్రు సురేష్, ఐరేణి శ్రీధర్, సంగెం వేణు, కోరుకొప్పుల అంజనేయులు, పుప్పాల నరేష్, ఎండీ కాజ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి విత్తనం.. విశ్వవృక్షమైంది!

- శ్రీ రామకృష్ణ సాయి మందిర సేవలు అమోఘం
- యాదగిరిగుట్ట పూర్వ ప్రధానార్చకులు నల్లన్ తీగల్ లక్ష్మీనరసింహాచార్యులు
- ఘనంగా పరాభవ నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ





**రాజపేట, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** రాజపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరం భక్తి విత్తనాన్ని నాటి విశ్వవృక్షంలా విస్తరించిందని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ పూర్వ ప్రధాన అర్చకులు నల్లన్ తీగల్ లక్ష్మీనరసింహాచార్యులు కొనియాడారు. శుక్రవారం ఆయన తన ధర్మపత్ని విజయలక్ష్మితో కలిసి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో 'పరాభవ' నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద దాచేపల్లి శ్రీనివాస్ దంపతులు వీరికి మంగళహారతులతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రధాన వీధుల గుండా మేళతాళాలు, బాణాసంచా వేడుకల మధ్య ఆలయానికి చేరుకోగా, అర్చకులు వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ పూర్ణకుంభంతో ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహాచార్యులు మాట్లాడుతూ.. ఆలయ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్, సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. భక్తులకు గోత్రనామ అర్చనలు చేసి, ఆశీర్వచనాలు అందజేశారు. భవిష్యత్తులో ఈ ఆలయంలో రామాయణ, భారత, భాగవత ఉపదేశాలు నిర్వహించేందుకు కృషి చేస్తానని ఆయన ప్రకటించగా భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం విజయవంతం చేసిన ఆలయ నిర్వాహకులు, ట్రస్ట్ సభ్యులకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## కవయిత్రి మొల్లమాంబకు ఘన నివాళి

- రాజపేటలో ఘనంగా 586వ జయంతి వేడుకలు

**రాజపేట, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** ప్రసిద్ధ తెలుగు కవయిత్రి, కుమ్మరి ఆడపడుచు మొల్లమాంబ 586వ జయంతి వేడుకలను రాజపేటలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ చౌక్ వద్ద ఆమె చిత్రపటానికి వివిధ పార్టీల నాయకులు, కుమ్మర సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రామాయణాన్ని మధురమైన తెలుగులో అందించిన మొల్లమాంబ తెలుగు సాహితీ వనంలో చిరస్మరణీయురాలని కొనియాడారు. మొల్లమాంబ స్ఫూర్తితో నేటి తరం సాహిత్యం పట్ల మక్కువ పెంచుకోవాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం మండల కన్వీనర్ బోనాల వెంకటేశం, జిల్లా సహాయ కార్యదర్శి నాగపురి పుల్లయ్య, సర్పంచ్ కోయ మధు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నెమల మహేందర్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుమలేష్, భాజపా మండల అధ్యక్షుడు రమేష్, చెల్మలపల్లి లక్ష్మణ్, కాయితి బాల్రెడ్డి, డాక్టర్ రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# మునుగోడులో రహదారుల అభివృద్ధికి శ్రీకారం





- రూ.4.75 కోట్లతో రెండు కీలక రోడ్ల పనులకు శంకుస్థాపన
- పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**మునుగోడు, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నట్లు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మునుగోడు మండలంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించి, సుమారు రూ. 4.75 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత చెలిమెడ గ్రామంలో రూ. 1.75 కోట్లతో చెలిమెడ నుండి బొత్తలగడ్డ వరకు నిర్మించే రహదారి పనులను ప్రారంభించారు. అనంతరం కల్వకుంట్ల గ్రామంలో రూ. 3 కోట్ల వ్యయంతో కల్వకుంట్ల నుండి వెంకటేశ్వర్ నగర్ మీదుగా చండూరు మండలం కొండాపురం వరకు చేపట్టే రోడ్డు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలను పట్టణాలతో అనుసంధానించడమే లక్ష్యంగా నాణ్యమైన రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, నిర్దేశించిన సమ యంలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం చేసిన నాయి బ్రాహ్మణ సంఘం..

**వృద్ధాశ్రమంలో వైద్యం శాంతారామ్ బర్త్డే వేడుకలు.**

**పోలవరం మార్చి 13(తొలివెలుగు న్యూస్):** తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు, మరియు టీడీపీ రాష్ట్ర నాయి బ్రాహ్మణసాధికార సమితి అధ్యక్షులు వైద్యం శాంతారామ్ జన్మదినోత్సవ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర నాయి బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి, పోలవరం మండలం తెలుగు యువత అధ్యక్షులు పెద్దెహపు వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలవరం నియోజకవర్గ నాయి బ్రాహ్మణ సేవా సంఘం తరఫున వైద్యం శాంతారామ్‌ద జన్మదిన వేడుకలు పోలవరం మండల కేంద్రం వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలవరం మండలం టీడీపీ మండల అధ్యక్షులు మంగిన కొండ పాల్గొని పెద్దెహపు వీర వెంకట సత్యనారాయణ, నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులతో కలిసి వైద్యం శాంతారామ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేశారు. అనంతరం వైద్యం శాంతారామ్ జన్మదినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వృద్ధులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా పీవీవి సత్యనారాయణ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా వైద్యం శాంతారామ్ విశేష సేవలు అందిస్తున్నారని ,రాష్ట్ర నాయి బ్రాహ్మణ సమితి అధ్యక్షులుగా నాయి బ్రాహ్మణలకు అండగా నిలుస్తున్నారని



కొనియాడారు. రాష్ట్రంలో నాయి బ్రాహ్మణులు అందరూ ఏకతాటి పైకి రావడానికి ఆయన చేసిన కృషిని ఈసందర్భంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా సాధికార సమితి సభ్యులు పట్నాల నారాయణరావు. ఉభయ గోదావరి జిల్లాల ఆర్ ఎమ్ పి డాక్టర్స్ కార్యదర్శి మరియు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు డాక్టర్ పేద్దేహపు రాజేష్ . ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బీసీ సెల్ కార్యదర్శి మరియు వడ్డెర సేవా సంఘం అధ్యక్షులు క్రొవ్విడి విష్ణు , ఏలూరు జిల్లా నాయి బ్రాహ్మణ యువజన ఉపాధ్యక్షులు పెద్దపల్లి గంగాధర్. నాయి బ్రాహ్మణ సంఘం పోలవరం సభ్యులు కందిపప్పు సత్యనారాయణ, కాదులూరి గంగాధర్, పెద్దేహపు గంగాధర్, పేరూరి శ్రీనివాస్, కందిపప్పు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబర్లు,సోషల్ మీడియాలో వచ్చే గ్యాస్ వదంతులు నమ్మదు బిజెపి చిట్టా మధు

**గొల్లప్రోలు, (తొలివెలుగు న్యూస్): ప్రతినిధి,స్టేట్ బ్యూరో,మార్చి, 13:** గొల్లప్రోలు బిజెపి పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు మాట్లాడుతూ, ఏపీలో ఎల్పీజీ నిలువల పుష్కలంగా ఉన్నట్లు అధికారులు,స్థానిక ప్రభుత్వం చెప్పడం జరిగింది. భరోసా యుద్ధ యుద్ధ పరిస్థితులు నేపాధ్యంలో వంటగ్యాస్ భరోసా ఇచ్చింది ప్రస్తుతం రాష్ట్రంలో 17962 మెట్రిక్ టన్నుల ఎల్పిజి నిలువలు అందుబాటులో ఉన్నాయని ఎక్కడ గ్యాస్ కొరత లేదని స్పష్టం చేసింది బుకింగ్ చేసుకున్న రెండు ఐదు రోజుల్లోనే సిలిండర్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని గృహ వినియోగదాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొంది అత్యవసర రంగాల కూడా గ్యాస్ సర్ఫ్రా నిరంతరాయంగా కొనసాగుతుందని ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం తెలిపింది. గ్యాస్ సిలిండరీ బుక్ చేసుకున్న డెలివరీ కాకపోతే వినియోగదారులు ఫిర్యాదు చేయాలని ఆయిల్ కంపెనీలు సూచించే కేంద్రం కొత్త నిబంధన ప్రకారం బుకింగ్ చేసిన తరువాత సుమారు రెండున్న రోజుల్లో సిలిండర్ డెలివరీ



చేయాల్సి ఉంటుంది. డెలివరీ ఆలస్యం అయితే ఇండియన్ గ్యాస్ వినియోగదారులు 1800233555లేదా 7718955555కు, భారత్ గ్యాస్ కస్టమర్లు 180022-4344 లేదా 77 15012345 ఎజూ గ్యాస్ వినియోగదారులు 1800 -233555 లేదా 9493602222కాల్ చేసి పిరియడ్ చేయవచ్చు.

## రాజపేట పీహెచ్‌సీలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- వైద్య సిబ్బంది హాజరుపై ఆరా
- రికార్డులు అస్తవ్యస్తంగా ఉంటే ఉపేక్షించబోం: కలెక్టర్ అనురాగ్ జయంత్

**రాజపేట, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంత్ శుక్రవారం రాజపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయాన్నే ఆసుపత్రికి చేరుకున్న ఆయన, తొలుత సిబ్బంది హాజరు పట్టికను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యులు, ఇతర సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఓపీ విభాగానికి వెళ్లి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సంతృప్తిగా ఉన్నారా? మందులు ఉచితంగా ఇస్తున్నారా? అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కేవలం చికిత్స అందించడమే కాకుండా, ఏ వ్యాధికి ఏ మందులు ఇచ్చారో రికార్డుల్లో స్పష్టంగా ఉండాలన్నారు. లేబొరేటరీ, లేబర్ రూమ్, మెడికల్ స్టోర్లను పరిశీలించి, గత నెలలో జరిగిన ప్రసవాల వివరాలను అడిగారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.





## పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ పంపిణీ

**పోలవరం సర్పంచ్ తనయుడు పాడుం శ్యామ్ కుమార్**

పోలవరం (తొలివెలుగు న్యూస్): ఏలూరు జిల్లా ఇంచార్జ్ మార్చి 13 : పోలవరం మండలం లో సోమవారం నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన సహాయం అందించారు. ఈ సందర్భంగా సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో చదువుతున్న 62 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన ఫ్లాంక్‌లు మరియు ఎగ్జామ్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కిట్స్‌ను పోలవరం సర్పంచ్ తనయుడు శ్రీ పాడుం శ్యామ్ కుమార్ పాఠశాల యాజమాన్యం సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. విద్యార్థులు భయపడకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## అంగన్‌వాడీలో అభినవ పాలకులు!

- కలెక్టర్‌గా, సర్పంచ్‌గా చిన్నారుల పరకాయ ప్రవేశం

**రాజపేట, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో శుక్రవారం చిన్నారులు పాలకులుగా మారి సందడి చేశారు. స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా పిల్లలు వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల పాత్రలను పోషించి మెప్పించారు. జిల్లా కలెక్టర్‌గా పొలిమేర రోహన్, ఐసీడీఎస్ పీడీగా ఎర్ర గోకుల నితిన్, గ్రామ సర్పంచ్‌గా పెద్దోళ్ళ అశ్విన్ బాధ్యతలు స్వీకరించినట్లు నటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. అంతేకాకుండా, సీడీపీఓగా సాత్విక, సూపర్‌వైజర్‌గా మేకల వెన్నెల, అంగన్‌వాడీ టీచర్‌గా మేకల శ్రీవిద్య విధులను నిర్వహించారు. ఆరోగ్య రంగంలోనూ చిన్నారులు తమ ప్రతిభను చాటారు. ఆరోగ్య కార్యకర్తగా తార్లపల్లి దక్షిత, ఆశా కార్యకర్తగా దుబ్బాసి భువనేశ్వరి, ఆయాగా అగుల్ల సౌర్య ఆయా పాత్రల్లో ఒదిగిపోయారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రమణ, అంగన్వాడి టీచర్ పార్వతి, ఆరోగ్య కార్యకర్త అనిత, ఆశా కార్యకర్త లక్ష్మీప్రసన్న, అంగన్వాడి ఆయా, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.






## వంగపల్లి పీహెచ్‌సీలో అదనపు కలెక్టర్ తనిఖీ

- వైద్య సేవలపై ఆరా.. సిబ్బందికి దిశానిర్దేశం
- కాలం చెల్లిన మందులను వెంటనే తొలగించాలి: భాస్కర్ రావు




**యాదగిరిగుట్ట, మార్చి 13:** యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు శుక్రవారం వంగపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని రిజిస్టర్లను తనిఖీ చేసి, వైద్య సిబ్బంది హాజరును పరిశీలించారు. అనంతరం మందుల నిల్వ గదిని పరిశీలించి, మందుల లభ్యతపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మందుల కొరత ఉండకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా కాలం చెల్లిన మందులను గుర్తించి వెంటనే పక్కన పెట్టాలని, నిరంతరం స్టాక్ రిజిస్టర్లను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు అందుతున్న వైద్య సేవలు, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాల అమలు తీరును ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు.

## మత్స్యాద్రి ఆలయంలో హుండీ లెక్కింపు



**వలిగొండ, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** వలిగొండ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. సహాయ కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి వెంకటేశం ఆధ్వర్యంలో, మహదేవపురం శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం పర్యవేక్షణలో ఈ లెక్కింపు చేపట్టారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి మోహన్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. 148 రోజులకు గాను హుండీల ద్వారా రూ.15,92,030 ఆదాయం లభించింది. అలాగే నిత్య అన్నదానం ద్వారా రూ.13,581, స్వామివారి కల్యాణ కట్నాల ద్వారా రూ.25,828 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్ణకంటి కలమ్మ యాదయ్య, మాజీ చైర్మన్ నరేష్ రెడ్డి, వేద పండితులు, కెనరా బ్యాంక్ సిబ్బంది వెంకటస్వామి, శ్రీ సాయి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్: సర్పంచ్ గార్ధాస్ విక్రమ్

- ఇంద్రపాలనగరంలో ఘనంగా ఇఫ్తార్ విందు..
- పాల్గొన్న ముస్లిం సోదరులు



**రామన్నపేట, మార్చి 13 (తొలివెలుగు న్యూస్ ):** క్రమశిక్షణ, దానధర్మాలు, సోదరభావానికి రంజాన్ మాసం నిలువెత్తు రూపమని ఇంద్రపాలనగరం సర్పంచ్ గార్ధాస్ విక్రమ్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం గ్రామ పరిధిలోని మసీదులో ముస్లిం సోదరులకు ఆయన ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో సర్పంచ్ పాల్గొని ముస్లిం మత పెద్దలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని మతాల సారాంశం మానవత్వమేనని, గ్రామంలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న గంగా-జమునా తెహజీబ్ సంప్రదాయాన్ని కాపాడుకోవాలని కోరారు. రంజాన్ ఉపవాస దీక్షలు సహనాన్ని నేర్పుతాయని, ఇటువంటి సామూహిక విందులు మనుషుల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డు సభ్యులు, యువ నాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్, ముస్లిం మత పెద్దలు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారంలో యంత్రాంగం విఫలం: ఎస్. వీరయ్య






- సిపిఎం జిల్లా ప్రాంతీయ సమావేశంలో ప్రభుత్వ తీరుపై ధ్వజం

**చౌటుప్పల్, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ వీరయ్య విమర్శించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో నిర్వహించిన సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రాంతీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పడి సంవత్సరాలు గడిచినా ప్రజా సమస్యలు ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉన్నాయని ఆయన అన్నారు. పారిశుద్ధ్య లోపాలు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. పట్టణంలో ప్రజా పార్కులు ఏర్పాటు చేయాలని, అధిక వర్షాలు వచ్చినప్పుడు కాలనీల్లోకి నీరు చేరకుండా పకడ్బందీగా కాలువలు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. చౌటుప్పల్‌లో ఫ్లైఓవర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, వంద పడకల ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్గత రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి కోతులు, కుక్కలు, పందులు, దోమల బెడద నుండి ప్రజలను రక్షించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను ఆయన తీవ్రంగా విమర్శించారు. ధరలు పెంచి సామాన్యులపై భారీ భారాలు మోపుతున్నారని, ప్రజలు జీవించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. సిపిఎం నిర్వహిస్తున్న ప్రజా పోరాటాలకు ప్రజలు విరాళాలు అందించి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇంటింటికి సిపిఎం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను అధ్యయనం చేసి ఏప్రిల్ నెలలో స్థానిక సమస్యలపై గ్రామీణ స్థాయిలో పోరాటాలు చేపడతామని తెలిపారు. జిల్లాలో మూసీ నదిని శుద్ధి చేసి గోదావరి జలాల వినియోగానికి సంబంధించి సమగ్ర ప్రణాళిక రూపొందించి నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే పిల్లాయిపల్లి కాలువ, ధర్మారెడ్డిపల్లి కాలువ, భూనాదిగాని కాలువ, భీమలింగం కాలువ, ఆసిఫ్‌నహార్ కాలువ పరిధిలో మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం, మహిళలకు ప్రతినెల రూ.2,500, పెన్షన్ల పెంపు, ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వ భరోసా, ఉద్యోగాల కల్పన వంటి హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ, నాయకులు మాటూరు బాలరాజు, బూరుగు కృష్ణారెడ్డి, శ్రీనివాసాచారి, జిల్లెల్ల పెంటయ్య, ఎండి పాషా, గంగాదేవి సైదులు, గోశిక కరుణాకర్, రాగిరి కిష్టయ్య, దోనూరి నర్సిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, సిర్పంగి స్వామి శివ, బండారు నరసింహ, బత్తుల దాసు, చీరిక సంజీవరెడ్డి, అశోక్ రెడ్డి, అంజిరెడ్డి, ముత్యాలు, శివ, మధు కృష్ణ, తడక మోహన్, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదు

**రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

**ఆదిలాబాద్ (తొలివెలుగు న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అవ సరమైన మేరకు గ్యాస్ సిలిం డర్లు అందుబాటులో ఉన్నా యని రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉ త్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. గ్యాస్ సరఫరా విషయంలో ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవ స రం లేదని స్పష్టం చేశారు. శుక్ర వారం హైదరాబాద్ నుంచి రా ష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు, ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి రామకృష్ణారావు, తదిత ర ఉన్నతాధికారులతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించా రు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల స రాఫరా పరిస్థితి, రైతులకు సా గునీటి అందుబాటు, ఇతర అంశాలపై సమగ్రంగా సమీ క్షించారు. మంత్రి ఉత్తమ్ కు మార్ రెడ్డి మాట్లాడుతూ, రా ష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గ్యాస్ సిలిండర్ల సరఫరా సజావుగా కొనసాగుతోందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచు కొని తగినంత స్టాక్ అందు బా టులో ఉంచామని, సరఫరా లో ఎలాంటి అంతరాయం ఉండదని తెలిపారు. గ్యాస్ సిలిండర్ల లభ్యతపై వ్యాప్తి చెందుతున్న అసత్య ప్రచారా లను ప్రజలు నమ్మవద్దని సూచించారు.

**జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదు: జిల్లా కలెక్టర్**




రాజర్షి షా

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జి ల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్ట రే ట్ విసి హాల్ నుండి నుంచి పాల్గొన్న అనంతరం అధికారు లతో మాట్లాడుతూ, జిల్లాలో రైతుల పంటలకు అవసరమై న సాగునీరు కూడా సమృద్ధి గా అందుబాటులో ఉందన్నా రు. రైతులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా సాగునీరు అం దించేందుకు ప్రభుత్వం అన్ని చ ర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశా రు. జిల్లాలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిరం తరాయంగా కొనసాగుతుంద ని, వినియోగదారులు ఎటు వంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గ్యాస్ రీఫిల్లింగ్ గడువును 15 రోజుల నుండి 20 రోజులకు పెంచడం జరిగిందని, దీనివల్ల ఎటువంటి కొరత ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. జిల్లా లో సిలిండర్ల స్టాక్ తగినంత ట్ర్భా అందుబాటులో ఉందని కలెక్టర్ వివరించారు. ప్రజలు అనవసరంగా భయాందోళనతో గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూ కట్టవద్దని కోరారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా పౌర సరఫరాల శాఖ అధికారులు, గ్యాస్ కంపెనీ ప్రతినిధులతో నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్ లేదా సరఫరలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 1800-425-1939 కు సంప్రదించి తెలియజేయవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు ఎస్పీ సురేందర్ రావు, ఎస్ఈ ప్రభుకళ్యాణ్, వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, పౌరసరఫరాల అధికారి నందిని, మార్కెటింగ్ అధికారి గజానన్, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## పదో తరగతి విద్యార్థినులకు పరీక్షా సామగ్రి పంపిణీ

- స్టైంత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నుల అందజేత
- ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: ఎంఈఓ జ్యోతి

**రామన్నపేట, మార్చి 13 (తొలివెలుగు న్యూస్ ):** పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉన్నత ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి (ఎంఈఓ), పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి ఆకాంక్షించారు. శుక్రవారం రామన్నపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్ట్రెంత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, బత్తిని రాజు గౌడ్ ఆర్థిక సహకారంతో విద్యార్థినులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థినులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలను ఎదుర్కోవాలని, భవిష్యత్తులో అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. స్ట్రెంత్ ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర నరేష్ మాట్లాడుతూ.. విద్యే మనిషికి నిజమైన సంపద అని, కష్టపడి చదివి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బత్తిని రాజు గౌడ్, ఆవుల సాయి యాదవ్, ఆవుల మత్స్యగిరి యాదవ్, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.



## అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- విద్యార్థులకు అవగాహన కల్పించిన అగ్నిమాపక శాఖ
- నివారణ చర్యలపై ఫైర్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి సూచనలు

**రామన్నపేట, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** నిత్య జీవితంలో అకస్మాత్తుగా సంభవించే అగ్నిప్రమాదాల పట్ల ప్రతి విద్యార్థి ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని రామన్నపేట మండల అగ్నిమాపక కేంద్రం అధికారి బి. మధుసూదన్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వివేకానంద డివిజన్ హైస్కూల్ (ఇంగ్లీష్ మీడియం)లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు భయాందోళనకు గురికాకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చని పేర్కొన్నారు. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు మంటలను ఎలా అదుపు చేయాలి, అందుబాటులో ఉన్న అగ్నిమాపక పరికరాలను ఏ విధంగా ఉపయోగించాలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ ఫైటర్లు డి. రామనర్సయ్య, మీర్జా షఫీ బేగ్, పాండు, ప్రతి సురేష్, వెంకటేశంలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున్, నాగరాజు, అమూల్య, విద్యాసాగర్, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.





# షరతులు లేకుండా 'ఆసరా' అందించాలి: రాపోలు నరసయ్య

- ఘనంగా రామన్నపేట మండల సీనియర్ సిటిజన్స్ సమావేశం

**రామన్నపేట, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** రామన్నపేట మండల సీనియర్ సిటిజన్స్ కమిటీ సమావేశం మండల అధ్యక్షుడు జెల్ల శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఆల్ సీనియర్ సిటిజన్స్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు నరసయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సీనియర్ సిటిజన్స్‌కు ఎలాంటి షరతులు లేకుండా ఆసరా పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నాయని, భూములు ఉన్నాయని కారణాలతో కొంతమంది వృద్ధులకు పెన్షన్ నిరాకరించడం వల్ల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని సీనియర్ సిటిజన్స్‌కు ఎలాంటి సమస్యలు ఎదురైనా మండల కమిటీని సంప్రదించాలని సూచించారు. సమస్యలు స్థానికంగా పరిష్కారం కాకపోతే రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహ, సిరిపురం చేనేత సహకార సంఘం అధ్యక్షుడు అప్పం రామేశ్వరం, సీనియర్ సిటిజన్స్ మండల కార్యదర్శి కూనూరు సుదర్శన్, మండల ఉపాధ్యక్షుడు మిర్యాల భాస్కర్, నాయకులు మిర్యాల రామలింగం, రాపోలు లక్ష్మీనారాయణ, రాపోలు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## మొల్లమాంబ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

- రామన్నపేటలో కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు



**రామన్నపేట, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో కుమ్మర సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఊట్కూరి శ్రీను మాట్లాడుతూ.. రామాయణాన్ని తొలిసారిగా తెలుగులో అనువదించిన కవయిత్రి మొల్లమాంబ జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే కుమ్మర కుల బాంధవులందరికీ మొల్లమాంబ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ విభాగం మండల అధ్యక్షుడు ఊట్కూరి నరసింహ, పట్టణ అధ్యక్షుడు ఊట్కూరి సత్యనారాయణ, ఊట్కూరి కృష్ణ, ఊట్కూరి విజయ్, ఊట్కూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

- మృతి చెందిన పంచాయతీ కార్మికుని కుటుంబానికి ఆర్థిక చేయూత
- రూ.33 వేల చెక్కు అందజేసిన సర్పంచ్ గరిక సత్యనారాయణ



**రామన్నపేట, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** రామన్నపేట పట్టణ కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు గాదె నరసింహ కుటుంబాన్ని సర్పంచ్ గరిక సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ నిధుల నుంచి రూ.33 వేల ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గరిక సత్యనారాయణ మాట్లాడుతూ.. అనారోగ్యంతో మృతి చెందిన నరసింహ కుటుంబానికి గ్రామపంచాయతీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోటె రమేష్, మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్, వార్డు సభ్యులు, నాయకులు ఎండి అక్రమ్, జాడ సంతోష్, కొమ్ము శేఖర్, మోటె మహేష్, కొమ్ము రామస్వామి, అన్వర్, నకరకంటి సుదర్శన్, గొరిగె శేఖర్, బండ లింగస్వామి, రాపోలు ఉపేందర్, ఊట్కూరు శ్రీను, గ్రామపంచాయతీ సిబ్బంది రాజ్ కుమార్, నకిరేకంటి రాము, గాదె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు

**కొమరం భీం జిల్లా (తొలివెలుగు న్యూస్):** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గృహ అవసరాల కుఎల్పిజి గ్యాస్ కొరత లేదని వినియోగదారులు ఎటువంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో నిల్వలను అందుబాటులో ఉంచినట్లు, ఎల్పిజి సిలిండర్లు పక్కదారి పట్టకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సరైన విధంగా సిలిండర్లు ఉపయోగించేటట్లు చూడడానికి ప్రత్యేక మానిటరింగ్ కమిటీ నియమించినట్లు తెలిపారు. ప్రజలు ఎవరు కూడా ముందస్తు బుకింగ్ లు అవసరం లేదని, వినియోగదారుల అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నట్లు తెలిపారు. బుకింగ్ లు నిలువలపై రోజువారి సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# గ్రామ ప్రగతిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం







- ముగిసిన రెండో విడత శిక్షణ తరగతులు
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి: జడ్పీ సీఈఓ శోభారాణి

**చౌటుప్పల్, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ మండలంలోని గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వార్డు సభ్యులకు నిర్వహించిన రెండవ విడత శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి హాజరై వార్డు సభ్యులకు పలు సూచనలు చేశారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కట్టుబడి పనిచేయాలని ఆమె సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలను సమర్థంగా అందించేందుకు స్థానిక సంస్థల ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వార్డు సభ్యులకు ఈ సందర్భంగా ధృవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి సందీప్ కుమార్, సూపరింటెండెంట్ బి విజయకుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శులు, శిక్షణ బృంద సభ్యులు శ్రీకాంత్, శివశంకర్, వెంకటేశ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.









## విపత్తు వేళ అప్రమత్తత అవసరం

- ట్రినిటీలో అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన
- ఫైర్ ఫైటర్ అనిల్ కుమార్

**చౌటుప్పల్, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో ట్రినిటీ విద్యాసంస్థల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 8వ తరగతి విద్యార్థులకు వంటగ్యాస్ వల్ల సంభవించే ప్రమాదాలు, వాటి నివారణ చర్యలను ప్రత్యక్షంగా చూపించి వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది అగ్నిమాపక పరికరాలను ఎలా ఉపయోగించాలో విద్యార్థులకు ప్రదర్శన ద్వారా తెలియజేశారు. చెక్క, పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులు వంటి ఘన పదార్థాలు, ఎల్పీజీ వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, కిరోసిన్ వంటి ద్రవ పదార్థాలు వేడి, ఆమ్లజనకంతో కలిసి అగ్ని అంటుకుంటాయని వివరించారు. అగ్ని వ్యాపించకుండా ఆమ్లజనకాన్ని అడ్డుకునేందుకు ఫోమ్, కార్బన్ డయాక్సైడ్ వాడటం, వేడిని తగ్గించేందుకు నీరు, మంచు ఉపయోగించడం ద్వారా మంటలను ఆర్పవచ్చని ప్రదర్శించారు. అలాగే ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు అగ్నిమాపక శాఖకు 101, పోలీసులకు 100, అంబులెన్స్ సేవలకు 108 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో విపత్తు నివారణ బృందం సభ్యులు లీడింగ్ ఫైర్ ఫైటర్ ఆర్. అనిల్ కుమార్, సాంకేతిక సిబ్బంది కే. శేఖర్, అగ్నిమాపక సిబ్బంది టి. ప్రసాద్, వి. పాండు, వి. భాగ్యనాయక్, ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్, ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఉజ్జిని మంజుల, సంస్థల అధ్యక్షుడు కె.వి.బి. కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో హాజరుకావాలి

- ఒత్తిడి వీడి ప్రశాంతంగా పరీక్షలు రాయాలి: డీఎస్పీ మధుసూదన్ రెడ్డి
- 300 మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

**చౌటుప్పల్, మార్చి 13:** పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంత చిత్తంతో పరీక్షలు రాయాలని చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ విద్యాలయం, అంకిరెడ్డిగూడెం మైనార్టీ గురుకుల పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓరగంటి ఎట్టయ్య అంజమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన 300 పరీక్షా ప్యాడ్లు, పెన్నులను డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి పరీక్షలు తొలిమెట్టు వంటివని పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఎంతోమంది ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని, విద్యకు పేదరికం ఎన్నడూ అడ్డుకాదని హితవు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్, ఎంఈఓ గురవరావు, కౌన్సిలర్లు బత్తుల వాణి విప్లవ గౌడ్, బద్రి గాలయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవాని, బాలకృష్ణ, శివజ్యోతి, నాయకులు తూర్పునూరి రవి గౌడ్, బొమ్మిరెడ్డి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర రైతు వ్యతిరేక విధానాలపై పోరుకు సిద్ధం కావాలి

- మార్చి 23న రాష్ట్రవ్యాప్త ధర్నాలు: టి.సాగర్ పిలుపు
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్





**చౌటుప్పల్, మార్చి 13 (తొలివెలుగు న్యూస్):** కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మార్చి 14 నుంచి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి రాష్ట్రపతికి వినతిపత్రాలు పంపాలని, అలాగే మార్చి 23న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ పిలుపునిచ్చారు. శుక్రవారం చౌటుప్పల్‌లో జరిగిన గోడపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశం అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, నాలుగు కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ బిల్లు2025, విత్తన బిల్లు2025లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వీబీ గ్రామజీ చట్టం2025ను కూడా ఉపసంహరించుకోవాలని కోరారు. గ్రామసభల నిర్ణయాల మేరకు గ్రామీణ ప్రజలకు పని హామీ ఇచ్చే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే విధంగా వీబీ గ్రామజీ చట్టాన్ని అమలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బహుళజాతి కంపెనీల విత్తనాల దిగుమతులకు అవకాశం కల్పిస్తూ, విత్తనాల అక్రమ విక్రయాలకు దారితీసే కొత్త విత్తన బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం దేశ సార్వభౌమత్వాన్ని, స్వావలంబనను అమెరికాకు అప్పగించిందని విమర్శించారు. చారిత్రాత్మక రైతు పోరాటాల నేపథ్యంలో 2021 డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులకు పూర్తి రుణమాఫీతో పాటు అన్ని పంటలకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తోందని, వస్తు సేవల పన్ను వసూళ్లలో రాష్ట్రాలకు 60 శాతం వాటా ఇవ్వాలని కోరారు. తెలంగాణలో రైతులు నిర్వహిస్తున్న పోరాటాలకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షాలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, చీరిక అలివేలు, జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, బోయిన్ ఆనంద్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చీరిక సంజీవరెడ్డి, దొనూరు నర్సిరెడ్డి, కందాడి సత్తిరెడ్డి, ఆకుల ధర్మయ్య, తుమ్మల నర్సిరెడ్డి, గూడూరు బుచ్చిరెడ్డి, పగిళ్ల లింగా రెడ్డి, బొమ్మగాని శంకరయ్య, పొట్ట శ్రీను, బొడ్డు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# విజయ్ చివరి సినిమాకు మరో అడ్డంకి..
# "జన నాయగన్" సెన్సార్ మళ్లీ వాయిదా

జీుఖుఖుఝుస్త్రుఖఅ । తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ నటిస్తున్న భారీ చిత్రం "జన నాయగన్" పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. దర్శకుడు హెచ్ వినోద్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో విజయ్ సరసన పూజా హెగ్డే, మమితా బైజు హీరోయిన్లుగా నటిస్తున్నారు. ముఖ్యంగా ఇది విజయ్ కెరీర్‌లో చివరి సినిమా అని ప్రకటించిన తర్వాత ఈ చిత్రంపై మరింత ఆసక్తి పెరిగింది. తమిళంలో "జన నాయగన్"గా వస్తున్న ఈ చిత్రాన్ని తెలుగులో "జన నాయకుడు" పేరుతో విడుదల చేయడానికి నిర్మాతలు సిద్ధమవుతున్నారు. అయితే అనేక అడ్డంకులు వలన ఈ సినిమా వాయిదా పడుతూ వస్తుంది. అసలు ఈ సినిమా ఈ ఏడాది జనవరిలోనే విడుదల కావాల్సి ఉంది. కానీ కొన్ని సెన్సార్ సమస్యల కారణంగా విడుదల వాయిదా పడింది. అభిమానులు కొత్త రిలీజ్ డేట్ కోసం ఎదురుచూస్తుండగా ఇప్పుడు మరోసారి ఈ సినిమాకు అడ్డంకి ఏర్పడినట్టు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, సినిమా సెన్సార్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండగా రివ్యూ కమిటీకి సంబంధించిన సెన్సార్ యూనిట్‌లో ఒక సభ్యుడి ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో సెన్సార్ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలుస్తోంది. దీంతో మరోసారి ఈ సినిమా సెన్సార్ వాయిదా పడినట్టు సమాచారం. ఇలా విజయ్ చివరి సినిమాగా వస్తున్న "జన నాయగన్"కు వరుస అడ్డంకులు ఎదురవడం అభిమానుల్లో నిరాశ కలిగిస్తోంది. ఇప్పటికే విడుదల వాయిదా పడిన ఈ చిత్రం ఎప్పుడు సెన్సార్ పూర్తి చేసుకుని ప్రేక్షకుల ముందుకు వస్తుందో అన్న ఆసక్తి ఇప్పుడు సినీ వర్గాల్లో నెలకొంది. మరోవైపు ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుద్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఆయన కంపోజ్ చేసిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర యూనిట్ భావిస్తోంది. భారీ నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నాయి. విజయ్ కెరీర్‌లో చివరి సినిమాగా తెరకెక్కుతున్నందున "జన నాయగన్"పై అభిమానులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. మరి వరుస అడ్డంకులను దాటుకుని ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందో చూడాలి.



# సైలెంట్‌గా నిశ్చితార్థం చేసుకున్న యువ హీరో..

ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేశ్ తనయుడు, టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నిశ్చితార్థం చేసుకున్నారు. తాను ప్రేమించిన కావ్యా రెడ్డితో ఆయన ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో ఘనంగా ఎంగేజ్మెంట్ జరుపుకున్నారు. ఇరు కుటుంబాల పెద్దలు, బంధువులు, సన్నిహితులు సమక్షంలో ఈ కార్యక్రమం సాదాసీదాగా జరిగింది.ఈ నిశ్చితార్థ వేడుకకు సినీ పరిశ్రమకు చెందిన కొద్దిమంది ప్రముఖులు హాజరయ్యారు. హీరోయిన్ సంయుక్త మీనన్, దర్శకుడు బోయపాటి శ్రీను సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొని కొత్త జంటకు శు భాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఈ ఎంగేజ్మెంట్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. త్వరలోనే ఈ జంట వివాహ బంధంలోకి అడుగుపెట్టనుంది. కావ్యా రెడ్డి హైదరాబాద్‌కు చెందిన యువతి. ఆమెకు సినీ పరిశ్రమతో ఎలాంటి సంబంధం లేదు. ఆమె కుటుంబం న్యాయ వృత్తితో అనుబంధం కలిగి ఉంది. కావ్యా రెడ్డి తాత జడ్జిగా పనిచేయగా, ఆమె తండ్రి ప్రస్తుతం లాయర్‌గా సేవలందిస్తున్నారు. గత కొంతకాలంగా ప్రేమలో ఉన్న ఈ జంట పెద్దలను ఒప్పించి ఇప్పుడు పెళ్లి చేసుకునేందుకు సిద్ధమైంది. అయితే వీరి పెళ్లి ఎప్పుడు జరుగుతుందన్న విషయంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. త్వరలోనే పెళ్లి తేదీపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇక సినీ కెరీర్ విషయానికి వస్తే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ 'అల్లుడు శీను' సినిమాతో హీరోగా టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత స్పీడున్నోడు, జయ జానకీ నాయక, కవచం, సీత, రాక్షసుడు వంటి యాక్షన్ మరియు లవ్ స్టోరీలతో ప్రేక్షకులను అలరించారు. గత ఏడాది విడుదలైన భైరవం, కిష్కింధపురి సినిమాలతో మంచి విజయాలను అందుకున్నారు. ప్రస్తుతం ఆయన వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామా 'హైందవ'లో నటిస్తున్నారు. అలాగే లోకమాన్య దర్శకత్వంలో 'రామమ్' సినిమాలోనూ నటిస్తున్నారు. ఇదే కాకుండా సాగర్ కె చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'టైసన్ నాయుడు' చిత్రంలో కూడా హీరోగా నటిస్తూ బిజీగా ఉన్నారు.

సినిమా ప్రచార కార్యక్రమాలు, ఆడియో లాంచ్‌లు, అవార్డు వేడుకలు వంటి పబ్లిక్ ఈవెంట్లలో హీరోయిన్ల వస్త్రధారణపై చర్చలు కొత్త విషయం కాదు. బహిరంగ వేదికల్లో హీరోయిన్లను అనుచిత కోణాల్లో చిత్రీకరించడం విమర్శలకు దారి తీస్తోన్న నేపథ్యంలో కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు హీరోయిన్లు దీనిపై బహిరంగంగా గళం విప్పారు. కాంతారా చిత్రంతో గుర్తింపు పొందిన సప్తమి గౌడ

# అది పూర్తిగా అనైతికం

తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో.. మహిళా కళాకారులను కళాకారులుగానే చూడాలని, అనవసర జూమ్‌లు చేసి అవమానకరంగా చూపించడం పూర్తిగా అనైతికమని పేర్కొంది. ఆమె ఆవేదనకు రుక్మిణి వసంత్, ఆషికా రంగనాథ్ మద్దతు పలికారు. కళాకారిణుల వ్యక్తిగత గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మీడియా, డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కి ఉందని పేర్కొన్నారు.

భారతీయ సినీ పరిశ్రమలో భారీ అంచనాలు నెలకొన్న ప్రాజెక్టుల్లో ఒకటిగా దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న "రామాయణం" నిలుస్తోంది. బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, నటి సాయి పల్లవి సీతాదేవిగా నటిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక ఫోటో ఈ సినిమాపై కొత్త చర్చకు దారి తీసింది.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ ఫోటోలో రణబీర్ కపూర్ పక్కన సాయి పల్లవి కనిపిస్తోంది. ఆ ఫోటోను చూసిన కొందరు నెటిజన్లు సాయి పల్లవి సీత పాత్రకు సరిపోలేదని విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆమె లుక్ ఆ పాత్రకు సరిగ్గా లేదని సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. దీంతో ఈ ఫోటోపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. అయితే మరోవైపు ఈ ఫోటో అసలు సినిమా నుంచి లీక్ అయినది కాదని, అది ఏఐ సహాయంతో రూపొందించిన ఫోటో కావచ్చని కొందరు చెబుతున్నారు. ప్రస్తుతం ఏఐ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చిత్రాలు నిజమా కాదా అన్న సందేహాలు కూడా ఎక్కువగా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వైరల్ అవుతున్న ఆ ఫోటో నిజంగా సినిమా నుంచి లీక్ కాలేదని, అది ఫేక్ అయ్యి ఉండొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రపంచ స్థాయిలో నిర్మాణ విలువలతో రూపొందుతోంది. ఈ సినిమాకు హాలీవుడ్ ప్రముఖ సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు భారతీయ దిగ్గజ సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇద్దరు అంతర్జాతీయ స్థాయి సంగీత దర్శకులు కలిసి పని చేయడం ఈ ప్రాజెక్ట్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొస్తోంది.అలాగే ఈ చిత్రాన్ని అత్యాధునిక సాంకేతికతతో, విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. భారతీయ పురాణాలలో అత్యంత ప్రాధాన్యం ఉన్న రామాయణాన్ని ప్రపంచ స్థాయిలో ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు సమాచారం. ఈ భారీ చిత్రాన్ని మేకర్స్ ఈ ఏడాది దీపావళి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్డేట్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# 'రామాయణం'పై సోషల్ మీడియాలో కొత్త చర్చ..








# జున్ను లవ్స్ యూ

'గమ్ గమ్ గణేశ'మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ నయన్‌సారిక. ఆ తర్వాత కిరణ్ అబ్బవరంతో కలిసి 'ఆయ్', 'క' సినిమాల్లో అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇటీవల విడుదలైన రొమాంటిక్ కామెడీ 'విష్ణు విన్యాసం' మూవీలోనూ జున్ను (మనీషా) పాత్రతో అలరించింది. ప్రస్తుతం, నయన్ చేతిలో క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిలో సంగీత్ శోభన్ తో జంటగా నటించిన 'రాకాస' మూవీ ఒకటి. మానసశర్మ డైరెక్టర్. ఉమేశ్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిహారిక కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఇప్పటికే మేకర్స్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అలాగే మోహన్ లాల్ నటించిన వృషభ షూటింగ్‌లోనూ సారిక బిజీగా ఉంది. ఇక ఇటీవల రిలీజ్అయ్యిన 'విష్ణు విన్యాసం' చిత్రం సూపర్ హిట్ టాక్‌తెచ్చుకుంది. ఈసందర్భంగా అభిమానులను ఉద్దేశించి ఇంట్రెస్టింగ్‌పోస్ట్‌చేసింది నయన్.. 'జున్ను మీ అందరినీ చాలా ప్రేమిస్తుంది. నన్ను సపోర్ట్‌చేస్తున్నందుకు థాంక్స్' అంటూ ప్రేక్షకులతో పంచుకుంది.